# సమాజానికో సందేశం

స్టేషన్‌బైట రిక్షా దిగుతూండగా... ఆవిర్లు విడుస్తూ అప్పుడే కదిలి, మరుక్షణంలోనే వేగాన్ని పుంజుకుంటూన్న ట్రైన్ నన్నెంతో నిరాశ పరిచింది. ఎప్పుడూ రైళ్లు లేటు కదాని నేనీవేళ రెండు నిముషాలు ఆలస్యంగా చేరుకుంటే, అలా అనుకోటం తప్పని నిరూపించిందీ రైలీవేళ. చేసేదేంలేక, ఏ ఎన్క్వైరీ ఆఫీసుకెళ్ళి కనుక్కుంటే తరువాతిబండి గంటన్నర తర్వాతగానీ లేదనీ, అది ఇరవై నిముషాలు లేటుగా ఎడుస్తూందనీ తెలిసింది. జీవితంలో... దేనికొరకైనా ఎదురు చూడట మంటే...పరమ చికాకు! సగం జీవితం నిరీక్షణలో నాశనమైపోగా, మిగిలిన సగమూ బ్రతకాలన్న కోరిక తీరేందుకు పడే ఆరాటంలో ఆరిపోతుంది. ఆశయాలూ, ఆదర్శాలూ... ఇకవీటి గురించి ఆలోచించేందుకు మిగిలిందేముంది?

రెస్టారెంట్ వైపు వెళ్తూంటే అప్రయత్నంగా అప్పర్‌క్లాస్ వెయిటింగ్ రూమ్ వైపు నా దృష్టి మరలింది...

ఇందిర!

క్షణకాలంపాటు నా మనసులో ఇందిర రూపం వివిధ భంగిమల్లో విన్యాసం చేసింది.

నాలుగు సంవత్సరాల క్రితం ఆమెను ఒకటి రెండుసార్లు ఎప్పుడైనా చూసిన వాళ్ళు ఇప్పుడు మళ్ళీ గుర్తుపట్టడం కష్టం.

ఆమెతో మాట్లాడాలా వద్దాంటూ మనసు

నటరాజ్ ముక్కామల



ఘర్షణ పడుతూంది. లోపల సోఫాలో ఒంటరిగా కూర్చొని ఏదో పత్రిక పేజీలను తిరగేస్తూన్న ఇందిరను అలా బైటనుంచే చూస్తూ నిల్చొన్నాను.

మాట్లాడకూడదన్న పట్టుదలను మాట్లాడాలన్న కోరిక జయించింది.

దగ్గరగా వెళ్ళి నేను పిలవబోయేంతలో తనే తలెత్తి, ఎదుట అలాకనిపిస్తూంది నేనేనాన్నట్టుగా నా వంక ఆశ్చర్యంగా చూసింది. ఆమె మనసులో మెదుల్తూన్న ఆ ఆలోచనలను చదవటానికి ప్రయత్నించాను, కానీ సాధ్యం కాలేదు.

నాకు తెలిసినంతవరకూ ఇందిరను ఏనాడూ ఎవరూ అర్థం చేసుకోలేక పోయారనే నా నమ్మకం. అందుక్కారణం ఆదామెలోని గొప్పతనమో, ఎదుటివారి అసమర్థతో నాకు ఈనాటికీ అంతు పట్టలేదు.

ఇందిర నన్నలా చూడటంలో ఎంతమార్పు? ఆమార్పు అర్థాన్ని సరిగా అర్థం చేసుకోలేక పోతున్నాను. నేను పెదవి విప్పబోయేంతలో తనే పలుకరించింది.

"కులాసానా? ..."నన్ను పలకరించటంలో అంత బాధెందుకో కూడా అర్థంకావటంలేదు.

ఆమెలో కొట్టొచ్చినట్లు కనుపిస్తూన్న అవేక

మార్పులకు కారణాలను వెదకటానికి ప్రయత్నిస్తూ నవ్వి ఊరుకొన్నాను

"ఈ నాలుగేళ్ళలో మీరంతగా ఏమీ మారలేదు" నవ్వింది

ఇందిర నవ్వినప్పుడు ఆమె అందం ద్విగుణీకృతమయ్యేది ఇప్పుడీ నవ్వులో జీవాన్నే చూడలేకపోతున్నాను బలవంతాన పెదాల్ని కదిలించినట్లుంది

"మీరిక్కడ ఉంటున్నారని ఈమధ్యనే తెలిసింది"

"ఎలా ?"

"ముకుందం చెప్పాడు" అంటూ తలొంచుకుంది

ముకుందం !. ఇంకా ఇందిర నీడనే బ్రతుకుతున్నాడన్నమాట పేరసైట్ !

"ముకుందం నిన్నింకా విడిచిపెట్టలేదానేకదా మీరాలోచిస్తూంది ?"

తన ఎదుటి మనిషి మనసులో మెదిలే ఆలోచనలను ఇందిర ఇట్టే కనిపెట్టేస్తుంది ఆమె ఆ ప్రత్యేకత కొన్ని సమయాల్లో ఎదుటి వాళ్లను చాలా ఇబ్బందుల్లో ఇరికిస్తుంది

"ముకుందానికీ నాకూ పెళ్లయిందంటే మీరు నమ్మలేరేమో !"

"వ్వాట్ ?!"

నన్ను నేను నమ్మలేనట్లుగా వుంది వాళ్లిద్దరికీ పెళ్లయిందని ఇందిరే స్వయంగా చెప్తున్నా నమ్మలేక, అదెలా సాధ్యమవగలదని ఊహలకందక ఉక్కిరిబిక్కిరవుతూన్నాను

తన తల్లిదండ్రులను కాదని ఆ కన్నవారి మమకారానిక్కూడా దూరమయ్యేందుకు ఇందిర సిద్ధపడిందంటే అదామె ఇష్టానికీ, కోరికకూ, ఆమె అంతరాత్మకూ సంబంధించిన విషయం కట్టుకొన్న భర్తను కూడా ఒదిలేసి ముకుందంతో వెళ్లిపోయిందంటే అది ఆమె స్వార్థం తనతో చేయించిన సాహసమే కానీ, ముకుందం మీదున్న ప్రేమాభిమానాలు కాదు ఆమెచేత అలా చేయించింది ముకుందం ఇందిరమీద పెంచుకున్న ఆశకూడా కాదు అందుక్కారణం మళ్లీ పెళ్లి చేసుకోవాలన్న కోరిక తలెత్తినా, ముకుందం లాంటి క్యారెక్టర్‌ను ఇందిర ఎన్నుకున్నదంటే అది ఆమె తన ఇష్టానుసారంగా తీసుకున్న నిర్ణయం మాత్రం ఎట్టి పరిస్థితులలోనూ కాలేదు ఎలాంటి కారణాలు ఆ పెళ్లికి అనుకూలించాయో ఊహించటంకూడా కష్టతరం ! వాళ్లిద్దరకూ పెళ్లయిందన్నది నిజమని నమ్మబుద్ధి కావటంలేదు.

అదే మాట ఇందిరతో అన్నాను

ముకుందం తన తెలివితేటలతో ఏవో పరిస్థితులను సృష్టించి, ఎలాగో నమ్మించి, కేవలం ఆమెపై అతనెప్పటినుంచో పెంచుకొన్న కోర్కెను తీర్చుకోటానికి అతను విసిరిన వలలో ఇందిర చిక్కుకుపోయింది

"మీ ఇద్దరికీ పెళ్లయిందా ? ముకుందం నిన్ను పెళ్లాడాడా ?" అనడిగాను

నవ్వి, "మీ అంత తార్కికంగా నేను మాట్లాడలేను అలా మాట్లాడగలగడం మీ గొప్పతనమో,

# సమాజానికో సందేశం

మాట్లాడలేకపోవడం నా చేతకానితనమో నాకు తెలీదు" అని ఓ క్షణం ఆగి, "కానీ మా పెళ్లయిందన్నది మాత్రం నిజం" అంది ఇందిర, 'పెళ్లి'ని బాధగా ఒత్తి పలుకుతూ,. ఆ బాధను తనలోనే దాచుకోటానికి ప్రయత్నిస్తూ

"మీ ఇద్దరకూ పెళ్లవటం ముకుందం నిన్ను పెళ్లాడటం ఒకటి కాదు కానీ, నువ్వతన్ని.." ఇందిర నవ్వు మరింక మాట్లాడనీకుండా చేసింది

ఆమె నవ్వు నన్నొకప్పుడు కొన్ని రాత్రులు నిద్రపోనీకుండా పిచ్చివాణ్ణి చేసేది ఇప్పుడు ఆ నవ్వులో నుంచి తొంగి చూస్తూన్న విషాదం నన్ను పిచ్చివాణ్ణి చేస్తూంది

భారంగా శ్వాస విడుస్తూ,

"నేను నవ్వి ఎన్నాళ్లయిందో" అంది, నీరసంగా

"నువ్వానాడు నన్ను కనీసం ఓ స్నేహితుడిగానైనా భావించుంటే ఈవేళిలా మాట్లాడవలసొచ్చే అవసరం వుండుండేది కాదు" గతాన్నోసారి గుర్తు చేసాను

" నీ కోరికలకు వారధి కట్టాలన్నది కాదు నా ధ్యేయం ! నీ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని, నీ నిర్ణయం గురించి మరోసారి నిదానంగా ఆలోచించమని నేచెప్పే ఈ రెండు మాటలూ కేవలం ఓ సలహా మాత్రమే మనిద్దరి మధ్యా ఎలాంటి సంబంధమున్నా నీ జీవితాన్ని శాసించే అధికారం నాకులేదు ఆ మాటకొస్తే, ఎవరూ ఎవర్నీ ఆదేశించలేరు అసలు ఎవరిమీద వాళ్లకే అధికారం లేనప్పుడు మరో వ్యక్తిని ఆదేశించటం మూర్ఖత్వం ! కానీ, మంచి చెడ్డల గురించి ఆలోచించగలిగే నీ మనస్సాక్షి నీ మేలే కోరుతుంది కనుక దానినే అనుసరించటానికి ప్రయత్నించు నీ మనసుకు బాగోగుల గురించి స్థిమితంగా ఆలోచించే సమయాన్ని కల్పించిన తర్వాత నువు తీసుకొనే నిర్ణయం నీ భవిష్యత్‌ను నిర్ణయిస్తుంది ."

నాలుగేళ్లక్రితం మేం వేసిన 'ఓ నాటకం'లోని హీరో డైలాగులివి !

ఇందిర హీరోయిన్, నేను హీరో, ముకుందం విలన్‌గా మా కళాసమాఖ్య ఎన్నో నాటకాలను ప్రదర్శించింది ఆ మా ట్రూప్ ఆంధ్రదేశంలోనే కాక, ఎన్నో చోట్ల ఎంతో ఘనతను సంపాదించుకుంది ఇది నాలుగేళ్లనాటిమాట ఆ తర్వాతి సంవత్సరంలో కొన్ని సంఘటనలు మా జీవితాలనే మార్చివేసాయి ఓ సంవత్సరం తర్వాత మేం విడిపోవాల్సొచ్చింది

ఇద్దరి మధ్యా చోటు చేసుకున్న మౌనం మేం ఇప్పుడు పరాయివాళ్లమన్న భావనను గుర్తు చేస్తూండడం భరించలేనట్లు, తెగిపోయిన సంభాషణను తిరిగి అతుకుపెట్టింది ఇందిర

"జీవితం ఎంత విచిత్రమైంది ? కొన్ని బ్రతుకుల్లోని రవ్వంత సుఖానిక్కూడా నోచుకోని దురదృష్టపు జీవితాల్నెందుకు సృష్టిస్తాడో ఆ భగవంతుడు ?"

"కలల్నీ, కథల్నీ నిజమనుకొని వాటిని అనుభవించాలని భ్రమించేవాళ్లు ఆ ప్రయత్నంలో మోసపోయి, ఓటమిని అంగీకరించే శక్తిలేక తమ మూర్ఖత్వాన్ని నిందించుకొనే ధైర్యంలేక, తమ తప్పులన్నింటినీ మరొకడి మీద మోపటానికి దేవుడనేవాణ్ణి సృష్టించుకుంటారు ఆటువంటి వాళ్లంటే నాకు ఎలాంటి గౌరవమూలేదు"

"నేనన్నామూనా ?"

"నువ్వూ అటువంటి దానివయితే !"

"కాకపోతే ?"

"నువ్వీనాడింత విచిత్రంగా భగవంతుడనే వాణ్ణి తల్చుకోవలసి వచ్చుండేదికాదు"

మరో సమయంలో ఐతే ఆమె ఆ సజల నేత్రాలను ఓ క్షణం ముద్దాడి ఇందిరను గుండెలకు హత్తుకొని ఊరడించాలనిపించి వుండేది

"ఇప్పుడు మీ కాపురం మద్రాసులోనా ?" ఈసారి సంభాషణను మళ్లీ పట్టాలమీదకెక్కించటం నా వంతయింది

"నా కాపురం మద్రాసులో ముకుందం అప్పుడప్పుడు వస్తూంటాడు" తనలో చెలరేగుతూన్న తుఫాన్ను ఏమాత్రం బైటపడనీకుండా వుండాలని ప్రయత్నిస్తూ, నా మాటలను సవరించింది ఇందిర

"అఫ్‌కోర్స్ అది నేనూహించగల్ను ! నీ జీవితం ఎలా గడుస్తూంది ?"

ఓ క్షణం సందేహించి,

"చెబితే బాధపడరు కదూ !" అంటూ ఇందిర నావంక చూస్తూంటే, ఆ చూపులో ఎంతో స్పష్టంగా వ్యక్తమవుతూన్న ఆవేదన నన్ను అంతకన్నా ఎక్కువగా కలవరపరుస్తూంది

"బాధపడేందుకేముంది ?" చెప్పమన్నట్లుగా చూసాను

"నేను ఆడదాన్ని !..." ఎంత ఆపుకోవాలని ప్రయత్నించినా, ఆమెలోని దుఃఖమంతా ఒక్కసారిగా బైటకు పెల్లుబికింది ఆనాటి తన కోరికలు ఈనాడు కరిగి, కన్నీరుగా మారి, అందం ఇనుమడించుకుపోతూన్న ఇందిర చెక్కిళ్లమీదుగా నదులై ప్రవహిస్తూన్నాయి

నా మనసంతా అల్లకల్లోలంగా వుంది సిగరెట్ వెలిగించుకున్నాను

నా చేతిలోని ఆరిపోబోతూన్న అగ్గిపుల్ల మంటవైపే చూస్తూ,

"నా జీవితానికీ, ఈ అగ్గిపుల్లకూ ఎలాంటి భేదమూ లేదిప్పుడు అవసరం తీర్చుకున్న వాళ్లందరూ నన్నూ కాళ్లకింద పడేసి రాసి నలిపేసారు" అంతులేదేమోననిపిస్తూన్న ఆ కన్నీటి ప్రవాహాన్ని అరికట్టడానికి ఎలాంటి ప్రయత్నమూ చేయకుండా, "సినీతారాపథంలో మిరమిట్లు గొలిపే కాంతితో వెలగాలన్న కోరికకు నేనే ఆహుతినైపోయాను . లెక్కలేనంత డబ్బుకు తోడుగా కొన్ని కోట్ల జన్మలకు సరిపడేంతగ దుఃఖాన్నీ కూడబెట్టుకోగలిగను" అంటూ కొండలను సైతం కరగించేలా ఇందిర అలా ఏడుస్తూంటే ఎలా ఊరడించాలో అర్థంకాక, మా ఇద్దరినీ ఎవరైనా గమనిస్తూన్నారేమోనని

# సమాజానికో సందేశం

వెనక్కు తిరిగి బైటకు చూసానోసారి ఆ ప్రాంతాల్లో ఎవరూ కనుపించలేదు

ఆ దుఃఖానికి హద్దుల్లేనట్లుంది ఆమెను చూస్తుంటే

వణుకుతూన్న చేతుల్తో ఇందిర భుజాన్ని బలంగా అదిమిపట్టి నొక్కాను

ఆ బాధనో, నా స్పర్శనో . భరించలేనట్లుగా, తన కళ్లలో నింపుకొన్న బాధనంతా నా కళ్లలోకి ప్రసరింపజేసింది కొంచెం దూరంగా జరిగి, మళ్లీ కుర్చీలో సర్దుక్కూర్చుంటూ, సిగరెట్ పొగను బలంగా లోపలకుపీల్చి, ఉంగరాలుగా బైటకొదిలాను

"గతాన్ని గుర్తుచేసుకొని ఇప్పుడెంత బాధ పడినా, ఆ పశ్చాత్తాపం నాకు మళ్లీ ఆ అందమైన ఆనందపు పాత జీవితాన్ని ప్రసాదించలేదని నాకు తెలుసు! కానీ, ఆశ " విపరీతమైన దగ్గుతెర ఇందిరను ఉక్కిరిబిక్కిరి చేస్తుంది ఆమె అలా మెలికలు తిరిగిపోతూ అంతబాధకు గురవుతూంటే నాహృదయాన్నెవరో రంపంతో కోస్తున్నట్లుంది

కాసేపయ్యాక, ఇక ఆ సంభాషణ మార్చాలన్న ఉద్దేశ్యంతో,

"నీ కళారాధన ఎంతవరకూ వొచ్చింది?" అనడిగాను

"హృదయాన్ని మీ ముందు విప్పిపరచినా, ఇంకా హేళన చేసి నన్ను మరింత గాయపరిచేంతటి క్రూరంగా మారిందా మీ హృదయం? " అన్న భావం . బాధ రెంటినీ మిళితంచేసి, నాకళ్లలోకి చూసింది ఇందిర

ఇది నటన మాత్రం కాదు!

ఇందిర స్వతహాగా ఎంతో గొప్పనటి అసలు ఆమె పుట్టింది ఈ నటనకోసమేనా అనిపిస్తుంటుందొక్కొక్కప్పుడు నటనే ఇందిర . ఇందిరే నటన! నటనే ఆమె సర్వస్వం! అందుకే, ఆకళకు అంకితమైపోయి, జీవితంలో ఎవరినీ, దేనినీ లెక్క చేయలేదు మనుష్యుల్లో అందునాఆడవాళ్లలో అంతటి తెగింపు చాలా అరుదు నటనకే తన జీవితాన్ని హారతినివ్వాలన్నతపన తల్లితండ్రులతో, భర్తతో తనకుగల సంబంధాలన్నింటినీ తెంచేసింది తన వాళ్లను కాదని, తన ధ్యేయాన్ని నెరవేర్చుకోవాలన్న పట్టుదల ఇందిర జీవితాన్ని ఓ నరకంగా, ఆ హృదయాన్ని ఓ అగ్నిగోళంగా మార్చిందీనాడు

ఇందిర ఈ స్థితికి ముకుందమే ముఖ్య కారకుడు

ముకుందం స్వభావానికి సరిపడ్డవే అతని పాత్రలూనూ మా ట్రూపులో అతన్ని ఎవరూ ఆదరించకపోయినా, ఎవరికీ అతనంటే స్నేహభావం లేకపోయినా, అతని నటనా ప్రతిభ ఎవరినీ అతని గురించి చెడుగా బైటకు మాట్లాడనీకుండా అందరి నోటినీ కట్టేసేది అతణ్ణి వదులుకుంటే, ఆ లోటును భర్తీ చేయడం ఎంతో కష్టమని అందరికీతెలుసు స్వలాభంకోసం, ఎంతటి వాణ్ణయినా తన మాటల్తో తనకు అనుకూలంగా మలచుకోటం ముకుందం ప్రతిభల్లో అన్నిటికన్నా గొప్పది అందరిలా ఇందిరా కూడా అతణ్ణి మొదటినుంచీ ద్వేషిస్తున్నా, అతని నటనాశక్తిని మాత్రం ప్రశంసించకుండా వుండలేకపోయేదికాదు

మాటలతో గారడీ చేసే అతని సమర్ధతలో ఇందిర రానురాను ఎంతో నమ్మకాన్ని పెంచుకో సాగింది ఆ నమ్మకమే ఆమెను అతనిముందు తలొంచేట్లు చేసింది అతనిద్వారా తనకోరికనూ ఆశయాలనూ నెరవేర్చుకోవాలని, జీవితంలో తనకు తానుగా అంతకుముందు ఏర్పరుచుకున్న ఎన్నో హద్దులను మీరింది ఇందిర

వెండితెర మీద మోజు బంగారు జీవితాన్ని బలితీసుకున్నాక, మూర్ఖత్వాన్ని ఇప్పుడు నిందించి ఏం ప్రయోజనం?

అసలు,

'నాన్సెన్స్ సినిమా వేషాలు వేస్తేనే కళా పోషణా?' అని మొదట్లో ఎంతో వాదించే ఇందిరను,

'నీ నటనా ప్రతిభను చూసే అదృష్టానికి నోచుకోని కోట్లాది సినీ ప్రేక్షకులు ఎంతటి దురదృష్టవంతులోనని వాళ్లు తెలుసుకుంటే ఎంత కుమిలిపోతారో నీకు తెలీదు! ఎన్నో అర్హతలున్న నీకు రత్నాల కిరీటాన్ని అలంకరించలేక పోతున్నామని నీ అందం, టాలెంట్ ఎంత విలపిస్తున్నాయోనని నువ్వెప్పుడైనా తెలుసుకోటానికి ప్రయత్నించుంటే, ఇలాగే ఈ రంగస్థలమే నీ సర్వస్వమని తృప్తిపడుతూ కూర్చోవు! కొంచెం కులుకు తెలిసిన ప్రతీ వయస్సు పిల్లా నటనలో అ ఆ లయినా తెలీకుండానే కళాసేవంటూ అందరినీ మోసగించటానికి ప్రయత్నిస్తుంటే, ఆ కళామతల్లి హృదయం ఎంతటి మూగవేదనను అనుభవిస్తుందో తెలిసికోటానికి ప్రయత్నించుంటే, ఒక ఆర్టిస్ట్‌గా నీ బాధ్యతేమిటో నువ్వు గుర్తించి వుండేదానివి!' అంటూ ఆమెను పూర్తిగా మార్చివేసాడు ముకుందం! తనతో వస్తే ఖ్యాతిని ఆమె కాళ్లమీద పడేటట్లు చేస్తానని సవాలు చేస్తూ, ఇందిరలో ప్రవహించే రక్తాన్ని ఉడికించాడు

ఎంతో గొప్పవాళ్లమనీ, ఎంతటి శక్తికీ లొంగనివాళ్లమనీ వొళ్లు విరుచుకున్నవాళ్లెంతమంది పొగడ్తలకు తలవంచలేదు?!

ఇందిర మామూలు మనిషి!

మీరిద్దరూ వెళ్లిపోయాక మా ట్రూప్ రెప్యుటేషన్ చాలా దెబ్బతిన్నా, నేను స్థాపించిన 'కళా సమాఖ్య'నే నేను అంటిపెట్టుకునివుంటూ, ప్రజల్లో మామీద పోయిన అభిప్రాయాన్ని మళ్లీ సంపాదించాలన్న ప్రయత్నంలో నా శక్తులన్నింటినీ కూడదీసుకొని శ్రమిస్తున్నానీ రెండేళ్లనుంచీ అయినా, ఇందిర ముకుందం లేకుండా అది అసాధ్యమనిపిస్తుంది యువ కళాకారులలో నటనలో ఉత్సాహం తప్ప, అందులో పరిపూర్ణత పొందాలన్న ఆసక్తి అందుక్కావలసిన సాధనా లోపించినట్లు కనుపిస్తుంది

చాలాసేపటికి ఇందిర మళ్లీ మామూలు మనిషిగా మారి, నా గత స్మృతులకు అంతరాయం కలిగించింది

"మీ కార్యకలాపాలు ఎలా వున్నాయి?"

"నిజం చెప్పాలంటే మీ ఇద్దరూ లేకుండా నేనీ సమాఖ్యను బ్రతికించలేకపోతూన్నాను కానీ, నా ఆశయాలు నీకు తెలుసు!" ఇంతవరకూ, అసలు ఇందిర ఇక్కడకు ఎందుకు వచ్చిందో అడగటమే మర్చిపోయానని ఇప్పుడు గుర్తొచ్చింది

"నిజం చెబితే నమ్ముతారా?"

"అబద్ధం చెప్తే నీకు ఒరిగేదేమీలేదుగ!"

"మిమ్మల్ని చూడాలని ఎన్నాళ్లనుంచో హృదయం ఆరాటపడ్తోంది రాత్రి ప్రదర్శించిన మీ నాటకం ఇంతకుముందు ఎన్నోచోట్ల ప్రశంసలను అందుకున్నదని చదివాను ఈ ప్రదర్శన చూడాలన్న కాంక్షతో ప్రయాణమయ్యాను "

'లేకపోతే ముకుందం ఒప్పుకోడా? "

"నెలరోజులనుంచీ అతనెక్కడ ఉంటూన్నాడో నాకే తెలీదు! ఇన్నాళ్లనుంచీ మిమ్మల్ని ఎన్నోసార్లు చూడాలనిపించినా ఆకోరిక తీర్చుకోలేకపోవటానికి కారణం మీ ముందు నిలబడే అర్హతను పోగొట్టుకున్నానన్న బాధ!' అని ఓక్షణమాగి, ఆనందాన్ని వ్యక్తపరుస్తూ "మీరు బంగారు కప్పను అందుకుంటూంటే నా ఆనందానికి అవధుల్లేవు ఆ క్షణంలో మీరెంత చేరి . " అని అంటూండగా, మళ్లీ దగ్గుతెర ఇందిరను మళ్లీ మాట్లాడనీకుండా చేసింది కాసేపు

"మీతో ముఖాముఖీ మాట్లాడెందుకు ధైర్యం చాలకపోగా, తెలిసిన వాళ్లెవరయినా మనిద్దరం కలసుండగా చూస్తే మీ గురించి ఏమైనా అనుకుంటారేమోనన్నభయం నన్ను వారించింది మిమ్మల్ని కనీసం చూడనైనాగలిగానన్న తృప్తిని గుండెల్లో దాచుకొని మద్రాసు తిరిగి వెళ్తున్నాను ఈ ట్రైన్‌లో రిజర్వేషన్ దొరికింది"

ఇందిరకు నామీద ఇంకా ఇంత అభిమానం ఉన్నదంటే నమ్మటం కొంచెం కష్టంగా వున్నా ఎంతో ఆనందంగా వుంది

కొంచెం సేపట్లో రైలు రాబోతూన్నట్లు గంట మోగింది

"ఇలా అప్రయత్నంగా తటస్థించిన ఈ కలయిక ఆ మధురమైన గతానుభవాలను గుర్తు చేస్తూ నా జీవితాన్ని వెక్కిరిస్తుంది "

ఆమె కళ్లలోకి చూసాను

ఆవేదన.. నిరాశ!.. ఈ రెండే ఆ అందమైన రెండు కళ్లల్లో రెండు ఆరిపోయే దీపాల్లా మిణుకు మిణుక్కుమంటూన్నాయి

నాతో ఇంకా ఏదేదో మాట్లాడాలనీ, నా నుండి ఏవేవో వినాలనీ, తనలో రగులుతూన్న మంటలను నా సన్నిహిత్యంలో ఆర్పుకోవాలనీ ఇందిర గుండెల్లో ఈ క్షణంలో ఎన్నోకోరికలు గూడుకట్టుకొన్నాయి కానీ తన కోర్కెలను బహిర్గతం చేయటానికి సందేహిస్తున్నట్లుగా వుంది తనలో ఇంకా ఎంతో మిగులున్న బాధనంతా నాముందు వెళ్లగక్కాలని ఆరాటపడుతూంది కానీ ఒక్కమాటా మాట్లాడలేక పోతూంది

నేనూ ఇందిరతో అంత ఫ్రీగా మాట్లాడలేక పోతూన్నాను

ఎలాగైనా, ఇప్పుడు మేం ఇద్దరం ఒకరి - కరం పరాయివాళ్లమే

రైలొస్తూన్నట్లు గణగణమంటూ గంట మోగింది

'మీకు రిజర్వేషనుందా ? " అనడిగింది ఇందిర, వెయిటింగ్ రూమునుంచి బైటకొస్తూ

లేదన్నట్లుగా తలూపాను

ఎదురుగా వస్తూన్న కండక్టర్ దగ్గరకెళ్లి మాట్లాడి వచ్చి, "పదండి, నాతోపాటు కూర్చోటానికి మీకు అభ్యంతరమున్నా ఈ ఒక్కసారికీ నా కోరిక కాదనకండి !" అంటూ అభ్యర్ధనగా నావైపు చూసింది

నేనా కోరికను తిరస్కరించలేకపోయాను

ఆ ఫస్ట్‌క్లాస్ కుపేలో మేం ఇద్దరమే... పరాయివాళ్లలా మౌనంగా కూర్చున్నాం

"మీరెంతవరకూ వెళ్తూన్నారు ?" అనడిగింది, ట్రైన్ కదిలాక

చెప్పాను

"అంటే షుమారు ఓ గంటసేపు మాత్రమే మనిద్దరం కలిసి ప్రయాణం చెయ్యెచ్చునను కుంటాను నాతో మద్రాసు వరకూ రాకూడదూ ?' ప్రతిమాలింది, వరం కోరుకుంటూన్నట్లుగా

"సారీ ఇందిరా ! మనిద్దరి గమ్యాలూ వేరు !"

"గమ్యం ! ? నాకే గమ్యమూ లేదు నేనిప్పుడు గాలి ఎటు వీస్తే అటు ఎగిరిపోయే గడ్డిపోచను ! ఒకప్పుడైతే, మనిద్దరి గమ్యం జీవితాంతం ఒకటిగా ఉండి ఉండేది కానీ, ఇప్పుడది అసాధ్యం ! అవునా ? " మెరిసిన ఆశ ఆ కళ్ళనుండి మరుక్షణంలో మాయమైంది

ఇందిరలో ఇంకా ఆ ఆశ ఎలా ఊపిరి పీల్చుకుంటూందో తెలీక, ఆశ్చర్యాన్ని అణచుకోలేక అలాగే, ఆమె కళ్ళలోకి చూస్తూ ఉండిపోయను చాలాసేపటివరకూ

"నాకు తెలుసు, అది అసంభవం ! నేనేనాడు మీ సలహాను తిరస్కరించానో ఆ క్షణంనుంచీ మనిద్దరి జీవితాలూ రెండు సమాంతర రేఖలయ్యాయి కానీ, నేను మోజుపడ్డ ఈ త్రోవ నిండా ఇన్ని ముళ్ళుంటాయని నా మూర్ఖత్వం ఆనాడు ఊహించలేకపోయింది నా గమ్యం చేరేందుకు దారిపొడుగునా ఇంతమంది రాబందుల నోట పడవలసొస్తుందనీ, ఈ జీవితం ఆ తర్వాత ఇంత ఎందుకూ పనికిరానిదిగా మారుతుందనీ నేనూహించలేదు నా మొండితనం మూర్ఖత్వం మనిద్దరి జీవితాలనూ వేరుచేసాయి అవి మళ్లీ కలుసుకోటం మీ దృష్టిలో అసంభవం ! ఈ అసంభవాన్ని సంభవంగా మార్చే శక్తి పవిత్రత నాలోనూ లేవు ! " తలొంచుకొని ఏడుస్తూంది ఇందిర !

నేను ఆమెను ఓదార్చలేను !

ఎరిగెత్తుతూన్నట్లున్న టెలిఫోను వైరు స్థంభాలను లెక్కపెడుతూ, అలాగే కిటికీలోనుంచి బైటకు చూస్తూ కూర్చున్నాను

నే దిగాల్సిన స్టేషన్ దగ్గరకొస్తూంది

"మీనుండి ఓ కోరిక కోరుకునే అర్హత నాకుందా ? " చాలాసేపటి తర్వాత, నావైపు ఎంతో దీనంగా చూస్తూ అడిగింది ఇందిర

"తీర్చమని బలవంతం చేస్తే అది నాకు సాధ్యమవుతుందో, లేదో ?"

కాసేపటి మౌనం తర్వాత,

"నేను చనిపోయేలోగా, మీరు నన్నొక్కసారి మనసారా 'ఇందిరా' అని పిలిచి, దగ్గరకు తీసుకొని నన్ను ముద్దు పెట్టుకుంటే ఈ జన్మలో నాకు మరో కోరికంటూ మిగలదు" అంది, ఆ కోరిక తీర్చుకోడం కోసమే తనిన్నాళ్లూ బతికున్నట్లుగా

నేనేం మాట్లాడలేదు

"నేనంతటి అస్పృశ్యురాలిననుకుంటాను ! " ఆమెగొంతు జీరబోయింది

"నీ కోరిక తీర్చేందుకు నాకు అభ్యంతరం లేదు..." ఇందిర బాధను చూడలేక, ఇష్టంలేకపోయినా నేను అందుకు ఒప్పుకోవలసొచ్చింది

ఆమె ఆనందానికి అవధుల్లేవు !


"ప్లీజ్ ఈ కోరిక ఇప్పుడే తీర్చండి ! " నాకు దగ్గరగా జరుగుతూ ఆ అడగటంలో ఎంతో ఆతృత కనుపిస్తూంది

"తొందరేముంది ?" అన్నాను లేని నవ్వును తెచ్చిపెట్టుకుంటూ

"నేను ఎంతోకాలం . వేచివుండలేను !" ఇందిర కనుకొనలలో కన్నీటిబిందువులు ముత్యాల్లా మెరుస్తూన్నాయి

"జీవితంలో నువ్వేమీ సాధించలేదింకా ! . నువ్వు ఆశించిన వాటిని ఇంకా రుచైనా చూడలేదు ! అప్పుడే నువ్వీ జీవితం మీద ఇంతటి నైరాశ్య భావాన్ని, విముఖతనూ ఏర్పరుచుకోవటం నీకు తెలీకుండానే నిన్ను మరింత కృంగదీస్తుంది ! "

"వీటన్నిటి గురించీ ఆలోచించే శక్తి, జ్ఞానం నాలో ఏనాడో నశించాయి !. . దయచేసి నా కోరిక నెరవేర్చరూ ?... మళ్లీ మనం ఈ జన్మలో కలుసుకోలేమేమోననిపిస్తూంది ! " అంటూ ఇందిర నామెడచుట్టూ తనచేతులు చుట్టి నాముఖాన్ని తనవేపు లాక్కుంది !



నాకన్నా తనే నన్ను బలంగా ముద్దుపెట్టుకొంది ఇందిర

వెచ్చని కన్నీటి బిందువులు నా చెంపల మీదుగా జాలువారుతూంటే, ఇందిరకళ్ళ తుడిచాను ఓదార్చటానికి ప్రయత్నిస్తూ

నే దిగాల్సిన స్టేషన్ సమీపిస్తూండగా మళ్లీ అంది

"నాతో మద్రాసు రాకూడదూ ?.. "

అంతటిదైన్యత ఇందిరలో నేను ఇంతకుముందు ఎప్పుడూ చూడలేదు

"దయచేసి నన్ను బలవంతం చెయ్యొద్దు ' "

ట్రైన్‌లోనుంచి దిగుబోతూంటే, నేనూహించనట్లుగా నా కాళ్లమీద పడి ఏడుస్తూ,

"ప్లీజ్. నాతో మద్రాసురండి !... నేనీ ఒంటరితనాన్ని భరించలేను నన్ను వదిలి వెళ్ళిపోకండి ! " అంటూ నన్ను దిగనివ్వకుండా నాకాళ్లను చుట్టేసింది ఇందిర

ఆమెను విడిపించుకోటం నా సాధ్యం కావటం లేదు

దిగిపోవాలన్న నా ఆతృత తెలిసి రైలింజను తన పైమయిందని కూతేసింది

"ఇందిరా ! . ప్లీజ్ ! నేను దిగిపోవాలి ! ఎప్పుడైనా మద్రాసొచ్చినప్పుడు నిన్ను తప్పకుండా కలుస్తాను " అన్నాను, నన్ను విడవమని బ్రతిమాలుతూ

"మీరు వస్తే ట్రైన్‌లోనుంచి బైటకు తోసేసినా నేను బాధపడను కానీ మీరు నావెంట లేకపోతే నేను ప్రాణాలతో మద్రాసు చేరలేను ! నా గుండె ఎంత ఆవేదనతో కొట్టుకుంటూందో చూడండి . " అంటూ నా కుడిచేతిని అందుకొని తన గుండెలకు ఆనించుకుంది

నేను యాక్టర్నే కానీ డాక్టర్ను కాదని తనకూ తెలుసు !

"నీ మొండితనాన్ని మర్చింకా వదల్లేదు..." చిరాకు కనుపించనీకుండా మందలించాను, ఇంకేమీ చేయలేక

స్టేషన్ ప్లాట్‌ఫాం అప్పటికే కనుమరుగయ్యింది

"మిమ్మల్ని బాధిస్తున్నానని నాకు తెలుసు కానీ, వేటగాడి బాణానికి గురై రెక్కలు విరిగి నేలవాలబోతూన్న పక్షి, ఎదురుగా ప్రత్యక్షమైన దేవుణ్ణే తనను ఆ వేటగాడి బారినుండి రక్షించమని అర్థించగలదేకానీ మొండితనంతో ఆ దేవుడి మనసును జయించగలదా ? తన కోరిక తీర్చమని శాసించగలదా ? "

నిర్మలాకాశంలో హాయిగా స్వేచ్ఛగా విహరిస్తున్న పక్షుల్ని నేలవాల్చడమే వేటగాడి వృత్తని తెలిసీ అతనిచుట్టే తిరిగే ఆ ప్రాణికి రక్షించమని అర్థించే అర్హత లేదని చెప్పాలనిపించింది కానీ ఇప్పటికే ఎంతో గాయపడ్డ హృదయాన్ని మరింత గాయపరిచేంతటి కఠినంగా మారలేకపోయింది నా హృదయం

చాలాసేపటి వరకూ ఇద్దరం నిశ్శబ్దపు తెరల చాటున దాక్కుంటూ కాలం గడిపాం

ఇందిర వైపు చూసానోసారి

# సమాజానికో సందేశం

నిద్రపోతోందో, తనలో అలజడి చేస్తున్న ఆవేదనా కెరటాలను జోకొడుతూందో తెలీటం లేదు

"నేనో కథ చెప్పనా ? " కళ్ళుమూసుకునే, తనలో తాను మాట్లాడుకుంటూన్నట్లుగా అంది ఇందిర, ఉన్నట్లుండి

'ఏమిటా కథ ?' అన్నట్లుగా చూశాను

కానీ ఇందిర నావైపు చూడటంలేదు

"ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యాభర్తలు భార్య మూర్ఖత్వంవల్ల, విచిత్ర పరిస్థితుల్లో విడిపోతారు భర్త తనను తిరిగి ఆదరించలేని పరిస్థితుల్లో తన తప్పును తెలుసుకున్న ఆ అబల తన భర్తను క్షమాభిక్ష పెట్టమని అర్థించలేక అనుక్షణమూ వేధించే తన దురదృష్టాన్ని భరించలేక, మరో జన్మంటూ వుంటే జీవితాంతమూ తన సర్వస్వాన్ని ఆ భర్తకే అంకితం చేసే భార్యగా నిలిచిపోవాలన్న కోరికతో, ఈ నికృష్టపు జీవితానికి సెలవు చెప్పాలనుకుంటూన్న సమయంలో భర్త ప్రత్యక్షమై, 'తప్పు చేయటం మానవసహజం' అంటూ ఆమెను తిరిగి తన జీవితంలోకి ఆహ్వానించినప్పుడు ఆమె అనుభవించే ఆనందం క్షణకాలమే అయినా, జన్మజన్మలకూ తన అదృష్టాన్ని తలుచుకుంటూ మురిసి పోతుంది ! " అంటూ, నావంక ప్రశ్నార్థకంగా చూస్తూ తన కథను నిలిపేసింది ఇందిర

"నవల రాయాలంటేనో, సినిమా తీయాలంటేనో థీమ్‌ను బాగాఉపయోగించుకోవచ్చును " నాకు తెలీకుండానే, నామాటల్లో కొంచెం కఠినత్వం చోటు చేసుకుంది

' నిజంగానా ? " అంది ఇందిర, సీరియస్‌గా

తనసలేం చెప్పాలనుకుంటూందో నాకు అర్థం కావటం లేదు

"ఈ కథను సినిమా తీస్తే మీరు నటిస్తారా ?. ." అదే సీరియస్‌నెస్ !

ఇందిర ఆంతర్యం నాకు ఇప్పుడు అర్థమైంది

తీరని కోరికలను అందమైన రంగుల్తో అలంకరించి, మధుర స్వప్నాల్లోకి వాటిని ఆహ్వానించి, ఆ ఆనందాన్ని అనుభవించాలన్న తృప్తిని పొందాలన్న ఇందిర తపనకు నవ్వొచ్చింది

"సినిమాలో నటించాలన్న కోరిక ఇంకా నీలో బ్రతికేవుందన్నమాట ! "

"ఈ జన్మలో తీరదేమోననుకొన్న నా కోరిక కొద్ది క్షణాల క్రితమే తీరింది ఇక, నాకు కోరికంటూ మిగిలిందేమీలేదు కానీ సినిమా జీవితంమీద వ్యామోహాన్ని పెంచుకుంటూన్న ఎందరో అమాయకురాళ్ల జీవితాలు విషాదాంతం కాకూడదని ఓ సినిమాగానే చూపించాలన్నదే నా తపన ! దీనిని మీరు 'కోరిక తీర్చుకోవడం' అంటే అలా చేయటం మానేస్తాను !. "

ఇందిర ఎంత బాధపడుతూ ఇలా అంటూందని ఊహించుకోడానికి నిదర్శనం ఆమె కన్నీళ్లూ వాటివెనుక స్పష్టమవుతూన్న ఆవేదనా !

"సమాజాన్ని చైతన్యవంతం చేయాలన్న ఆశయాలు లేకపోగా, 'వినోదం' ముసుగులో, చాలావరకూ, ఎన్నో జీవితాలను నాశనం చేస్తూందీ సినిమా రంగం అని బాధపడేవారే ? ఈ సినిమా కూడా ఏ జీవితాన్నైనా నాశనం చేస్తుందా ?

సినిమాలు చూసేవాళ్లూ, వాటిలో చేరాలని ఉబలాట పడేవాళ్లూ ఎన్నోరకాలుగా చెడిపోతూన్నారేకానీ ఏ విధంగా తమ జీవితాలను సరిద్దుకో గలుగుతూన్నారని ప్రశ్నించేవారే? ఈ సినిమా చూసైనా ఏ ఒక్కరూ తమజీవితాన్ని సరిదిద్దుకోలేరా ?

ఎక్కడో ఓ సినిమాలో ఏదైనా ఓ సందేశమంటూ వుంటే అది నిజజీవితంలో ఆచరణలో పెట్టడానికి అందుకోలేనంత ఎత్తుల్లో వుంటుందని విమర్శించేవారే ? ఈ సినిమాలోనూ ఓ సందేశం అంత ఎత్తుల్లో వుంటుందా ?

జీవితాన్ని తీర్చిదిద్దే సినిమాలు తీస్తే, ఆ చిత్రసీమకు ఈ సమాజం ఎంతో ఋణపడి వుంటుందని అనేవారే ? ఈ సినిమా ఒక్క జీవితాన్నీ తీర్చిదిద్దలేదా ?. . ."

అంతటి దుఃఖంలోనూ ఉప్పొంగుతూన్న ఇందిర మాటల్లోని ఆవేశం నన్ను మాట్లాడలేని అశక్తుణ్ణి చేసింది !

"ఈ సినిమాలో నటించటానికి నాకేలాంటి అభ్యంతరమూలేదు" అవటానికి ఎంతో సేపు ఆలోచించాల్సిన అవసరం లేకపోయింది నాకు

ఇందిర సంతోషానికున్న సంకెళ్ళు తెగిపోయాయి

" .'ఇందిర మహానటి !'...'ఆ చిత్రం తరతరాల యువతులకూ మార్గదర్శి !' 'సమాజానికి కనువిప్పు కలిగించే కళాఖండం !' అంటూ ప్రశంసల వర్షం కురుపించిన పెద్దలకూ, ప్రేక్షకులకూ, పత్రికలకూ హృదయపూర్వక కృతజ్ఞతలు ! ఈ 'సమాజానికో సందేశం' ఓ సినిమాగా కాక నిజమైన సందేశంగా కనీసం కొందరి జీవితాలలోనైనా దీపాన్ని వెలిగిస్తే ఇందిర జీవితం ధన్యమైనట్లే !

ఇది కథ కాదు, ఓ కవితా కాదు !. . యదార్థానికో రూపకల్పన ! 'నటన' ద్వారా తప్పు మరే పరిస్థితుల్లోనూ పోగొట్టుకొన్న తన భర్త అనురాగాన్నీ, ఆప్యాయతనూ పొందలేనన్న ఆలోచన ఈ చిత్ర నిర్మాణానికి ఓ కారణమైతే, నిజంగానే 'సమాజానికో సందేశం' అందివ్వాలన్న ఇందిర తపన మరో కారణం ! రెండింటిలోనూ ఇందిర ఘనవిజయాన్ని సాధించింది !

'ఆ ఇందిర భర్తను నేనే' అని ఈనాడు నా నోటినుండి వింటూ ఎంత సంతోషిస్తూందో ఇందిర దిగంతాల కవతలెక్కడినుంచో ఇదంతా చూస్తూ ! "

ఇందిర సృష్టించిన ఈ సినిమా జరువుకుంటున్న రజతోత్సవ సభలో ఆమెను తలుచుకుంటూ మాట్లాడుతూంటే నాలో పొంగిపొరలుతూన్న ఆనందం కన్నీటి రూపంలో కట్టలు తెంచుకుంటూండగా, ఉపస్థితుల కరతాళ ధ్వనులు విశ్వమంతా వ్యాపిస్తున్నాయి.. ఇందిర జన్మ ధన్యతకు ప్రతీకగా !